నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, శుక్రవారం 19 ఏప్రిల్ 2024 | NIZAMABAD


బాన్సువాడలోని పోలీస్ లైన్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాల తరగతి గదిని పరిశీలిస్తున్న కలెక్టర్

## మౌలిక సదుపాయాలు కల్పించాలి
### కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

ఎల్లారెడ్డి రూరల్/ గాంధారి/బాన్సువాడ, ఏప్రిల్ 18: వచ్చే జూన్ 10లోపు ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మరమ్మతులు చేపట్టి మౌలిక సదుపాయలు కల్పించాలని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన 'అమ్మ ఆదర్శ పాఠశాల' పథకంలో భాగంగా ఎల్లారెడ్డి పట్టణంలోని ఎర్రమన్నుకుచ్చ ప్రాథమిక, ఎంపీపీఎస్ బాలికల పాఠశాల, జడ్పీహెచ్ఎస్, గాంధారి మండలంలోని పొతంగల్ కలాన్ పాఠశాలతో పాటు బాన్సువాడలోని పోలీస్ లైన్ ప్రాథమికోన్నత, పాత బాన్సువాడలో ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. పాఠశాలల్లో తాగునీటి వసతి, టాయిలెట్స్, విద్యుత్ సౌకర్యం, చేపట్టాల్సిన మరమ్మతు పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో కలిసి పరిశీలించి సూచనలు, సలహాలు అందజేశారు. పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సంబంధిత శాఖ ఏఈలకు ఆయన సూచించారు. ఎంఈవోలు వెంకటేశం, సేవ్లానాయక్, నాగేశ్వర్‌రావు, ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు, ఈఈ మల్లేశం, ఏఈ శ్రీకాంత్ ఉన్నారు.

## డిగ్రీ పరీక్షలకు వన్‌టైం ఛాన్స్



డిచ్‌పల్లి, ఏప్రిల్ 18: టీయూ పరిధిలోని 2011 నుంచి 2016 వరకు డిగ్రీ (వైడబ్ల్యూఎస్) అనుత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వన్‌టైం ఛాన్స్ ఇస్తున్నట్లు నియంత్రణాధికారిణి ఆచార్య ఎం.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీఏ(ఎల్) కోర్సులకు 1వ, 2వ, 3వ సంవత్సరపు బ్యాక్‌లాగ్ పరీక్షలు జూన్, జూలైలో జరుగుతాయని, పరీక్ష ఫీజును మే 2 వరకు, రూ.100 అపరాధ రుసుముతో మే 3వరకు చెల్లించాలని పేర్కొన్నారు. 2016 నుంచి 2019 వరకు డిగ్రీ (సీబీసీఎస్) బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సుల్లో 1వ, 2వ, 3వ, 4వ, 5వ, 6వ సెమిస్టర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు వన్‌టైమ్ ఛాన్స్ ఇచ్చామని, పరీక్ష ఫీజును మే 2 వరకు చెల్లించవచ్చుని, అపరాధ రుసుముతో మే 3న చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పరీక్షల సూచించారు.

# ఉగ్ర భానుడు

**42.2°** గురువారం జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రత





- మండుతున్న ఎండలు
- మధ్యాహ్నం 12దాటితే రోడ్లన్నీ నిర్మానుష్యం
- అధిక ఉష్ణోగ్రతలతో జనం అవస్థలు
- వడదెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు

కామారెడ్డి, ఏప్రిల్ 18 : ఉమ్మడి జిల్లాలో ఎండలు ముదురుతున్నాయి. మండే సూర్యుడికి జనం అల్లాడుతున్నారు. ఇంటా, బయట ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎన్ని ఫ్యాన్లు, ఏసీలు ఉన్నా శరీరంలో వేడిగానే ఉంటున్నది. ఉదయం 7 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. మధ్యాహ్నం 12 దాటిందంటే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. సుమారు 42 డిగ్రీల పైనే ఉష్ణోగ్రత నమోదవుతున్నది. కామారెడ్డి జిల్లా ఏరియా దవాఖానలో ప్రతిరోజూ తలనొప్పి, విరేచనాల సమస్యలతో 10 నుంచి 15 మంది వరకు చికిత్స కోసం వస్తున్నారు. సాధ్యమైనంత వరకు 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

### ఎండదెబ్బ నుంచి రక్షణ ఇలా..

వేసవిలో ముఖ్యంగా శరీరంలో ఫ్లూయిడ్ లెవల్స్ పడిపోకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఫ్లూయిడ్ లెవల్స్ తగ్గితే శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. ఎక్కువ మోతాదులో నీళ్లు, పండ్ల రసాలు తీసుకోవాలి. గంటకు 2,3 గ్లాసుల నీరు తీసుకోవాలి. పుచ్చకాయ రసం, బార్లీ జావలో పటికబెల్లం, కొబ్బరి నీళ్లు తాగాలి. మజ్జిగ, నిమ్మరసం, చెరుకు రసం, తేలికగా జీర్ణం అయ్యే పదార్థాలను తీసుకోవాలి. అలాగే ఆల్కహాల్, కాఫీ వంటి పానీయాలకు దూరంగా ఉండడం మంచిది. ముఖ్యంగా పిల్లల విషయంలో తప్పనిసరి జాగ్రత్తలు పాటించాలి.

### ఎండలో వెళ్లినప్పుడు చేయకూడనివి..

- వేసవిలో నలుపు, మందమైన దుస్తులు ధరించొద్దు.
- ఎండ, వేడిగాలి తగలకుండా చూసుకోవాలి.
- అతి శీతల పానియాలు, మంచు ముక్కలు వంటివి తీసుకోవద్దు.
- ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటికి వెళ్లకుండా ఉండాలి.

### బయటికి వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- తెల్లని,పలుచని దుస్తులు,కాటన్ దుస్తులు ధరించాలి.
- ఎండలో నుంచి ఇంటికి రాగానే తీపి పదార్థాలు తీసుకోకూడదు.
- ఎండలో తప్పనిసరిగా వెళ్తే తలపై టోపీ,లేదా రుమాలు ధరించాలి.
- ఓఆర్ఎస్ కలిపిన నీటిని ఎక్కువగా తాగాలి.

### జాగ్రత్తలు పాటించాలి..



ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉండాలి. చిన్న పిల్లలకు 2,3 గ్లాసుల నీళ్లు, పెద్దవారు రోజుకు 5 లీటర్ల నీళ్లు తాగాలి. వడదెబ్బ తగిలితే వెంటనే దవాఖానలో చేర్పించి ప్రథమ చికిత్స చేయించాలి. ఉప్పు కలిపిన నీరు, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, పుచ్చకాయ రసం, మజ్జిగను ఎక్కువ మోతాదులో తీసుకోవాలి.

-డా.శ్రీనివాస్,
పిల్లల వైద్య నిపుణులు

### వడదెబ్బకు కారణాలు..

- నీరు తక్కువగా తాగడం.
- మత్తు పానియాలు ఎక్కువగా తీసుకోవడం.
- ఎండలో ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకుండా తిరగడం.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వడదెబ్బ తగిలిన వారిని చల్లటి ప్రదేశంలో ఉంచాలి.
- తడి బట్టతో శరీరమంతా తుడవాలి.
- శరీర ఉష్ణోగ్రత 36 డిగ్రీలు వచ్చే వరకు చల్లబరుస్తూనే ఉండాలి.
- వడదెబ్బ తగిలిన వారి శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థితికి రాకపోతే వెంటనే దగ్గరలోని దవాఖానకు తరలించాలి.

## తొలిరోజు రెండు నామినేషన్లు


నామినేషన్ దాఖలు చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి రాపెల్లి సత్యనారాయణ

కంఠేశ్వర్, ఏప్రిల్ 18: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నామినేషన్లను స్వీకరిస్తున్నారు. తొలిరోజు రెండు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. రిటైర్డ్ ఆర్టీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకుడు రాపెల్లి సత్యనారాయణ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఆర్టీసీ రిటైర్డ్,కార్పొరేషన్ ఎంప్లాయిస్‌కు ఉద్యోగ విరమణ తర్వాత పింఛన్ కోసమే తమ పోరాటమని ఆయన తెలిపారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలానికి చెందిన విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థి భూక్యా నందు నామినేషన్ వేశారు. నీళ్లు, నిధులు, నియామకాలు, ఉచిత విద్య తమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సూచనల మేరకు హైదరాబాద్‌లోని సదరన్ రీజియన్ అధికారుల బృందం మండలంలోని మద్దికుంటలో గురువారం పర్యటించింది. భూగర్భ జలాలు, మనుషుల ఆరోగ్యంపై అవి చూపుతున్న ప్రభావాలపై అధ్యయనం చేశారు. రాళ్లు, నీటి శాంపిల్స్‌ను సేకరించారు. బృందంలో కేవీ మారుతి, సంగ్రామ్ నాయక్, రమేశ్ ఉన్నారు.
– రామారెడ్డి, ఏప్రిల్ 18



## నెల రోజుల్లో.. రూ.52.71లక్షల నగదు సీజ్

వినాయక్‌నగర్, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక బృందాల ద్వారా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మార్చి 16 నుంచి ఏప్రిల్ 18వ తేదీ వరకు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన నగదు, లిక్కర్, ఇతర వాటి వివరాలను సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ వెల్లడించారు. నిజామాబాద్ అర్బన్‌లో రూ.39.92లక్షలు, 276 లీటర్ల లిక్కర్, రూ.28లక్షలు విలువజేసే 400 గ్రాముల బంగారం పట్టుకున్నారు. నిజామాబాద్ రూరల్ పరిధిలో రూ.లక్షా7 వేల540 నగదు, 464 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేశారు. ఆర్మూర్ పరిధిలో రూ.67వేల నగదు, 293 లీటర్ల లిక్కర్ పట్టుబడింది. బాల్కొండలో రూ.5.90లక్షల నగదు, 1263 లీటర్ల లిక్కర్, రూ.30.19 లక్షల విలువచేసే 1,77,130 బహుమతులను సీజ్ చేశారు. బోధన్ పరిధిలో రూ.54,620 నగదు, 251 లీటర్ల లిక్కర్, రూ.57వేల విలువజేసే గిఫ్టులను పట్టుకున్నారు. బాన్సువాడ పరిధిలో రూ.4.59లక్షల నగదు, 183లీటర్ల లిక్కర్, రూ.లక్షా17వేల విలువజేసే 4.69 గ్రాముల గంజాయిని సీజ్ చేసినట్లు సీపీ తెలిపారు. తనిఖీల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు.

## ఇద్దరు సీఐల సస్పెన్షన్

వినాయక నగర్, ఏప్రిల్ 18: మల్టీజోన్–1 పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు సీఐలపై వేటుపడింది. నిజామాబాద్ సీసీఎస్ సీఐ రమేశ్‌తో పాటు గతంలో బోధన్ సీఐగా పని చేసిన ప్రేమ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఐజీపీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ సీసీఎస్ సీఐ రమేశ్ మద్యం సేవించి విధులు నిర్వహించినట్లు ఆరోపణలు రాగా..విచారణలో వాస్తవమని తేలడంతో సస్పెండ్ చేశారు. గతంలో బోధన్ సీఐగా విధులు నిర్వర్తించిన ప్రేమ్‌కుమార్‌పై సైతం వేటు వేసినట్లు సమాచారం.


పాత కలెక్టరేట్ మైదానంలో బహిరంగ సభ కోసం కొనసాగుతున్న ఏర్పాట్లు

## గులాబీ దూకుడు



- నేడు బీఆర్ఎస్ బహిరంగ సభ
- హాజరుకానున్న మాజీ మంత్రి హరీశ్‌రావు
- సభ అనంతరం నామినేషన్ దాఖలు చేయనున్న బాజిరెడ్డి
- తరలిరానున్న పార్టీ శ్రేణులు, ప్రజలు
- పార్టీ గెలుపు బాధ్యతలు చేపట్టిన ముఖ్య నేతలు
- ఇప్పటికే నియోజకవర్గాల వారీగా సమావేశాలు

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నది. ప్రత్యర్థులకు అందనంత వేగంతో ప్రచారంలో దూసుకెళ్తున్న గులాబీ పార్టీ.. నేడు (శుక్రవారం) ఇందూరులో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నది. మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరుకానున్న ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలిరానున్నారు. పాత కలెక్టరేట్ మైదానంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. సభ అనంతరం మధ్యాహ్నం నిజామాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ నామినేషన్ వేయనున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ ముఖ్య నేతలతో కలిసి కలెక్టరేట్‌కు వెళ్లి అక్కడ నామినేషన్ దాఖలు చేస్తారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో పార్టీ అధినేత కేసీఆర్ బాజిరెడ్డికి బీఫారం అందజేశారు.


**సభ ఏర్పాట్లు పూర్తి..**

పాత కలెక్టరేట్ మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎండ తీవ్రత నేపథ్యంలో కార్యకర్తలకు ఇబ్బంది కలుగకుండా టెంట్లు వేయించారు. వేదికను ముస్తాబు చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతలు హాజరుకానున్న ఈ సభకు కార్యకర్తలు వేలాదిగా తరలిరానున్నారు.

**ప్రణాళికాబద్ధంగా..**

నిజామాబాద్ లోక్‌సభ స్థానంలో విజయమే లక్ష్యంగా బీఆర్ఎస్ పక్కా ప్రణాళికలు రూపొందించింది. లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు పార్టీ ఇన్‌చార్జీలను నియమించింది. పార్టీ శ్రేణులను సమన్వయం చేయడంలో భాగంగా ఇప్పటికే నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించారు. నిజామాబాద్ అర్బన్, రూరల్, బాల్కొండ, ఆర్మూర్, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముఖ్య నేతలతో కలిసి బాజిరెడ్డి విస్తృతంగా పర్యటించారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, జీవన్‌రెడ్డితో పాటు కోరుట్ల, జగిత్యాల ఎమ్మెల్యేలు సంజయ్, డాక్టర్ సంజయ్ పార్టీ గెలుపు కోసం సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నారు. తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ విజయం కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నారు.


బాజిరెడ్డికి బీఫామ్ అందజేస్తున్న కేసీఆర్. పక్కన వేముల, జీవన్‌రెడ్డి, బిగాల, సురేశ్‌రెడ్డి, ఆయేషా ఫాతిమా


కేటీఆర్‌తో జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, పోచారం, జాజాల, దఫేదార్ శోభ

## బీఫామ్‌ల అందజేత

ఖలీల్‌వాడి/కామారెడ్డి, ఏప్రిల్ 18: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన గురువారం పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో నిజామాబాద్, జహీరాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థులు బాజిరెడ్డి గోవర్ధన్, గాలి అనిల్‌కుమార్‌కు కేసీఆర్ బీఫామ్‌లను అందజేశారు. సమావేశంలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, కల్వకుంట్ల సంజయ్, నిజామాబాద్, కామారెడ్డి జడ్పీ చైర్మన్లు విఠల్‌రావు, దఫేదార్ శోభ, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, జీవన్‌రెడ్డి, జాజాల సురేందర్, జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, బీఆర్ఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు